సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



శ్రీశైలం మల్లన్నకు..

శ్రీశైలం మల్లన్నకు పొందూరు తలపాగా వెళ్లింది. ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. - 8లో



కేజీబీవీల్లో మెరుగైన విద్య

కేజీబీవీల్లో మెరుగైన విద్య అందుతోంది. అన్ని రంగాల్లోనూ విద్యార్థినులు రాణిస్తున్నారు. - 8లో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ కానుకల లెక్కింపు అనివెట్టి మండపం లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ తెలియజేశారు. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని ఆయన తెలియజేశారు.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ రైవాడ గ్రామానికి చెందిన చింతపల్లి జగదీష్ (42) మద్యం మత్తులో పురుగు మందు తాగి మృతి చెందినట్లు భార్య రాములమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6న భార్యతో తగదాపడిన జగదీష్ ఆమెను రాయితో కొట్టారు. దీంతో ఆమె గాయపడి పాతపట్నం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. దీనిపై మనస్తాపం చెందిన జగదీష్ 7వ తేదీ రాత్రి మద్యం మత్తులో పురుగు ముందు కలిసి తాగేశాడు. ఆ తర్వాతి రోజు విరేచనాలు కావడంతో తన సోదరుడికి విషయం చెప్పాడు. దీంతో 108 వాహనంలో అతడిని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రమణమూర్తి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అంతుచిక్కని వ్యాధితో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

పొందూరు: మండలంలోని రెడ్డిపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం అంతుచిక్కని వ్యాధితో రెండు ఆవులు ఆదివారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొంచాడ మహేష్ అనే రైతుకు చెందిన ఆవులు ఆదివారం సాయంత్రం వరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయి. ఒక్కసారిగా ఒకదాని తర్వాత ఒకటిగా నడుము విరుస్తూ కింద పడి కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాయని రైతులు చెప్పారు. వీటి ధర సుమారు రూ.80 వేలు వరకు ఉంటాయని తెలిపారు. హఠాత్పరిణామంతో గ్రామంలోని పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కంబాపు సూర్యారావు కోరారు.

20 ఎకరాల తోటల్లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీ పరిధిలోని సవర మర్రిపాడు, మర్రిపాడు గ్రామాలకు చెందిన 30 మంది గిరిజన, హరిజన, ఇతరులకు చెందిన సుమారు 20 ఎకరాల తోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. జీడి, మామిడి, టేకు, అకేశ, నీలగిరి, వెదురు, పనస తదితర చెట్లు కాలిపోయాయని రైతులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సోమవారం మిట్ట మధ్యాహ్నం మంటల వ్యాప్తిని చూసి సవర మర్రిపాడు గ్రామానికి చెందిన గిరిజనులు సవర జగ్గారావు, పెద్దింటి కృష్ణారావులు గ్రామస్తులకు తెలియజేశారు. వారు వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేలోగానే మంటలు తీవ్రంగా వ్యాప్తి చెందాయి. పలువురు రైతులు బకెట్లతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. జీడి మామిడి పువ్వు,పిందె నిండుగా ఉన్న సమయంలో ఇలాంటి ప్రమాదం జరగడంతో రైతులు దారపు వీరన్న, వునుకూరు బాలయ్య, తలగాన పెద్ద తిప్పన్న, సవర అప్పలమ్మ లతోపాటుగా పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

పార్ట్‌టైమ్ నర్సింగ్ ఉద్యోగానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టు పార్ట్ టైమ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆ సంస్థ కో ఆర్డినేటర్ మేరీ గ్రేసీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్స్‌తో నేరుగా 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేయాలని తెలిపారు. కంచిలిలో ఒక పురుష స్టాఫ్ నర్సు ఉద్యోగం భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 08942-279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛమైన ప్రేమ.. అచ్చమైన చిరునామా



- కులాంతర వివాహం చేసుకున్న గురువులు
- సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయ జంటలు
- నేడు ప్రేమికుల దినోత్సవం

మీది ఏ కులమని ప్రశ్నిస్తే.. ప్రేమికులమని సమాధానమిచ్చారు ఆ గురువులు. కులాంతర వివాహాలు చేసుకుని స్వచ్ఛమైన ప్రేమకు అచ్చమైన చిరునామాగా నిలిచారు. పెద్దలను ఒప్పించి కొందరు, స్నేహితుల సాయంతో ఇంకొందరు, జీవితంలో స్థిరపడ్డాక మరికొందరు ప్రేమించిన వారిని పెళ్లి చేసుకుని ప్రేమకు సార్థకత చేకూర్చారు. అదే ప్రేమను పునాదిగా చేసుకుని అందమైన జీవితాన్ని నిర్మించుకున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం. ఈ సందర్భంగా కొన్ని ప్రేమ కథలు..

– ఇచ్ఛాపురం రూరల్



ప్రేమకు ప్రతి'రూపం'

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన తరణి ప్రసాద్ మిశ్రా వంశధార నదీ తీరంలో సైకత శిల్పం రూపొందించారు. ఈ శిల్పం చూపరులను ఆకట్టుకుంటోంది. -ఎల్ఎన్ పేట

తొలి చూపులోనే..



ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, ప్రత్యూష దంపతులు

నరసన్నపేట మండలానికి చెందిన అక్కివలస శ్రీనివాసరావు 2010లో ఉపాధ్యాయ శిక్షణ పొంది ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా చేరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బోధనలో శిక్షణ పొందుతున్నప్పుడు సోంపేట మండలంకు చెందిన పి.ప్రత్యూష అనే ఉపాధ్యాయురాలితో స్నేహం ఏర్పడింది. మూడేళ్ల పాటు కొనసాగిన వీరి స్నేహం ప్రేమగా మారింది. వీరి వివాహానికి కులాలు అడ్డు గోడలుగా నిలిచాయి. వీరికి బాసటగా స్నేహితుడు సాధు శిబి చక్రవర్తి (మేఘాలయ రాష్ట్రం నార్త్ గోరోహిల్స్ జిల్లా కలెక్టర్) అండగా నిలిచారు. ఇద్దరు భావాలు ఒకటే కావడంతో 2013లో అన్నవరంలో అదే స్నేహితుల సమక్షంలో వివాహం జరిగింది.

వీరి దాంపత్యం ఎంతో అన్యోన్యంగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కాపురం సాగుతోంది. వీరికి అభినందన్, ఆరాధ్య అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం శ్రీనివాసరావు బుద్ధేపుపేట ప్రాథమిక పాఠశాలలో, ప్రత్యూష ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రేమించడం తప్పులేదు గానీ, ఆ ప్రేమ పేరుతో మోసం, దగా చేయకుండా ప్రేమ పవిత్రతను చివరి వరకూ కాపాడుకుంటూ వెళ్లాలంటూ నేటి ప్రేమికులకు ఈ దంపతులు సూచిస్తున్నారు.

తరగతి గది నుంచి..



గిరిబాబు, ఉమాకుమారి దంపతులు

ఇద్దరూ క్లాస్‌మేట్స్. ఒకే దగ్గర ఉపాధ్యాయ శిక్షణ పొందిన వీరు ప్రేమికులుగా మారి ఒక్కటై ఇప్పుడు ఒకే దగ్గర పనిచేస్తున్నారు. తొగరాంకు చెందిన ఉప్పు గిరిబాబు శ్రీకాకుళం గురజాడ బీఈడీ కళాశాలలో బయాలజీ ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్న సమయంలో శ్రీకాకుళానికి చెందిన ఉమాకుమారి అదే కళాశాలలో అదే కోర్సులో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఇద్దరి మధ్య ఏర్పడిన ప్రేమ సుమారు ఏడేళ్ల పాటు సాగింది. ఇద్దరూ నిరుద్యోగులే కావడంతో పెద్దలు వీరి ప్రేమకు అంతరాయం కలిగించారు. ఉద్యోగం వచ్చినప్పుడే మీ పెళ్లి అంటూ పెద్దలు హుకుం జారీ చేయడంతో ప్రేమను గెలిపించేందుకు కొంత కాలం ప్రేమకు స్వస్తి పలికారు. 2012 డీఎస్సీలో శ్రమించి ఒకేసారి బయాలజీ ఉపాధ్యాయ లుగా ఉద్యోగం సంపాదించారు. నేరుగా ఇద్దరూ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ గవర్నమెంట్ హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయులుగా చేరారు. వీరి కృషికి ఫిదా అయిన పెద్దలు ప్రేమ వివాహానికి పచ్చజెండా ఊపడంతో 2013లో పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు కుమారులు భార్గవ్, ప్రణవ్ ఉన్నారు.

స్థిరపడ్డాకే..



సంతోష్‌కుమార్, రాణీగౌడ దంపతులు

ఇద్దరు నిరుద్యోగుల మధ్య ఏర్పడిన స్నేహం.. ప్రేమగా మారింది. ఆపై పెద్దలను ఒప్పించి పెళ్లి కూడా చేసుకున్నారు. పాలకొండ బొంగు సంతోష్‌కుమార్ బీఈడీ చేసి డీఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసేవారు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన ఇచ్ఛాపురానికి చెందిన రాణీగౌడ ఒకసారి జిల్లాలో జరిగిన డీఎస్సీ సాధన సమితి సమావేశంలో సంతోష్‌ను కలవడంతో వీరి మధ్య స్నేహం చిగురించింది. అప్పటి నుంచి స్నేహితులుగా మారారు. ఈ నేపథ్యంలో 2014 డీఎస్సీలో ఇద్దరికీ ఉద్యోగాలు రావడం, యాదృచ్ఛికంగా సంతోష్‌కుమార్ సైతం ఇచ్ఛాపురం మండలానికే రావడంతో వారి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. సంతోష్‌కుమార్ హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరగా, రాణీగౌడ అదే రహదారిలో ఉన్న బొడ్డబడ ఒడియా ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. కాలం కలసి రావడంతో ఇద్దరి స్నేహం ప్రేమ వరకు వెళ్లి పెళ్లికి దారి తీసింది. ఇద్దరు కులాలు వేర్వేరు కావడంతో పెద్దలు పెళ్లికిససేమిరా అన్నారు. సంతోష్ చెల్లికి పెళ్లి అయిన తరువాత పెద్దల్ని మరోమారు ఒప్పించి 2018 మార్చి 8న మహిళా దినోత్సవం నాడు పాలకొండలో ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. వీరికి యశ్వంత్‌కుమార్ అనే కుమారుడు ఉన్నాడు.

మాస్టారు ప్రేమకథ..



సోమేష్ దంపతులు

కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన కీలు సోమేశ్వరరావు సోంపేట మండలం రుషికుద్ద ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ మండల డీఆర్పీగా వ్యవహరించేవారు. బారువ గ్రామానికి చెందిన ప్రమోదిని కుమారీ దాస్ 2009లో విద్యా వలంటీర్‌గా పనిచేసేవారు. మండల విద్యావనరుల కేంద్రంలో శిక్షణ సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. కులం అడ్డు వచ్చినా ఏడాది పాటు ఇరు కుటుంబ పెద్దల్ని ఒప్పించి ఎట్టకేలకు 2010లో పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం సోమేష్ ఇచ్ఛాపురం మండలం ధర్మపురం ఉన్నత పాఠశాలలో, ప్రమోదినీ కుమారీ దాస్ ఒడిశా బలియాగడ ఒడియా పాఠశాలలో పనిచేస్తున్నారు.

జాతీయ స్థాయికి మురపాక విద్యార్థుల ప్రాజెక్టు



మురపాక హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు

లావేరు: మండలంలోని మురపాక హైస్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైందని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.అరుణ తెలిపారు. విద్యార్థులను సోమవారం హైస్కూల్‌లో హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు. జనవరిలో ఎస్‌సీఈఆర్‌టీ వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారికి నచ్చిన దానిపై వీడియోలు చేసి పంపించాలని రాష్ట్రవ్యాప్తంగా కోరారు. మురపాక హైస్కూల్‌లో 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు జి.గౌతమి, జె.యోచన, కె.యశస్విని, బి.యశ్వంత్, పి.హేమసుందర్‌లు ఫార్మర్ అలెర్ట్ అలారం ఫ్రమ్ ఎలక్ట్రిక్ షాక్ ఇన్ అగ్రికల్చర్ అనే దానిపై వీడియో ప్రదర్శన చేసి ఎస్‌సీఈఆర్‌టీకు పంపించగా అది జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 16వ తేదీన బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శనలో మురపాక హైస్కూల్ విద్యార్థులు పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు గైడ్‌గా ఉపాధ్యాయురాలు ఎస్‌వీఎస్ పూర్ణిమ, ఇన్‌స్ట్రక్టర్ శ్రావ్యలు వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వి.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్య గుర్తించే సరికే..

శ్రీకాకుళం క్రైమ్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి వెనుక ఓ విషాదం బయటపడింది. సమాచారం తెలుసుకోవడం ఆలస్యం కావడంతో చివరి చూపు దూరమైంది. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ జంక్షన్ వద్ద ఓ వ్యక్తి ఈ నెల 5న స్పృహ కోల్పోయి పడిపోయాడు. అతడిని స్థానికులు రిమ్స్‌లో చేర్పించగా మరుసటి రోజే కన్నుమూశారు. దీనిపై 'సాక్షి' పత్రికలో 7వ తేదీన వార్త ప్రచురితమైంది. సోమవారం బూర్జ మండలం గుత్తావెల్లి గ్రామానికి చెందిన గోవిందమ్మ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, మృతి చెందిన వ్యక్తి తన భర్త చింతాడ గోవిందరావు అని చెప్పి, ఆధారాలు చూపించారు. 'సాక్షి'లో ప్రచురితమైన వార్త చూసి వచ్చానని చెప్పారు. కానీ అప్పటికే అతని మృతదేహాన్ని ఖననం చేసేశామని పోలీసులు చెప్పారు. చివరి చూపు కూడా దక్కకపోవడంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. తన భర్తకు తాగుడు అలవాటు ఉందని, ఎప్పుడూ ఎక్కడో తిరుగుతుంటాడని, అందుకే తాను కూడా కన్న ఊరు తోటాడ వెళ్లిపోయానని, తాగుడు వల్లనే తన భర్త అందరికీ దూరమయ్యారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరగనున్న శాసన మండలి ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప రెవెన్యూ సిబ్బంది ఎన్నికల సమయంలో సెలవులు పెట్టరాదన్నారు. పట్టభద్రులకు సంబంధించి 59 పోలింగ్ స్టేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలకు 4 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, కొవ్వాడ ఎస్‌డీసీలను ఆదేశించారు. అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డీపీఓ పోలింగ్‌కు సంబంధించి మెటీరియల్ చూసుకోవాలని, ఎన్నికల నియమావళి సీపీఓ, సింగిల్ విండో పర్మిషన్ సెట్ శ్రీ సీఈఓ చూడాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకులుగా బ్యాంకు, పోస్టల్ సిబ్బందికి శిక్షణ తరగతుల ఏర్పాటు లీడ్ బ్యాంక్ మేనేజర్ చర్యలు తీసుకోవాలని, బ్యాలెట్ పేపర్ మెప్మా పీడీ, వెబ్ కాస్టింగ్ వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రఫీ హౌసింగ్ పీడీ చూసుకోవాలని ఆదేశించారు. నామినేషన్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు ఎన్నికల కమిషన్‌కు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు చూసుకోవాలన్నారు.

ఎస్పీ స్పందనకు అర్జీలు 34



ఫిర్యాది సమస్య వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్పందనలో ప్రజలు చేసే ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం ఉండరాదని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 34 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలని అధికారులకు సూచించారు.

• నాట్య నివేదన



మందసలోని వాసుదేవ బ్రహ్మోత్సవాల్లో కళలు అలలై ఎగసిపడుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివశ్రీ నృత్య కళానికేతన్ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది.

– మందస



'గర్భగుడిలోకి ప్రవేశం వద్దు'



క్యూలు పరిశీలిస్తున్న ఏసీ సూర్యప్రకాశరావు

జలుమూరు: శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలు సజావుగా నిర్వహించాలని దేవదాయ శాఖ ఏసీ సూర్యప్రకాశరావు అన్నారు. సోమవారం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. గర్భగుడిలోకి కలెక్టర్, మంత్రి, శాశ్వత ధర్మకర్త మినహా ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. వీఐపీల పేరిట భక్తులను ఇబ్బందులు పెట్టకుండా సామాన్య భక్తులకు సైతం స్వామి దర్శనం చేయించాలన్నారు. క్యూలైన్‌ల ఏర్పాట్లు పరిశీలించి తాగునీరు, ఎండ తగలకుండా భక్తులకు తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే భక్తులకు మజ్జిగ, అన్నదానం తదితరవి ఏర్పాటుకు దాతలను చూడాలని ఈఓను ఆదేశించారు. ఉత్సవాల చివరి రోజు స్వామి త్రిశూల స్నానాలకు వంశధార నదిలో నిర్వహించే పుణ్యక్రతువుకు రహదారిని శుభ్రం చేయించాలని తెలిపారు. గర్భగుడిలో స్వామి భక్తులకు బాగా కనిపించేందుకు విద్యుత్ సౌకర్యం బాగా చేయాలన్నారు. ఆయనతోపాటు పరిశీలకులు ప్రసాద్‌బాబు, వెంకటరమణ,ఈఓ ప్రభాకరరావు, అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రట్టిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● ఇల్లు, రూ. 1.50 లక్షల నగదు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

మందస: భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, విలువైన సామాన్లు, నగదు దగ్ధమయ్యాయి. తాపీమేస్త్రీ మామిడి ఈశ్వరరావు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఈశ్వరరావు భార్య జ్యోతి ఇద్దరు పిల్లలను తీసుకొని బయటకు పరుగు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో రూ.1.50లక్షల నగదు, విలువైన డాక్యుమెంట్లు, సామానులు దగ్ధమయ్యాయి. స్థానికులు చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ మామిడి సింహాద్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులారి కూర్మారావు, పితాంబరం పరామర్శించారు.

30 బస్తాల ధాన్యం దగ్ధం



కాలిపోయిన ధాన్యం బస్తాలు

సోంపేట: అగ్ని ప్రమాదంలో 30 బస్తాల ధాన్యం కాలిపోయాయి. ఈ సంఘటన పలాసపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకోగా.. రైతు దున్న బైరికి చెందిన ధాన్యం దగ్ధమయ్యాయి. రైతు బైరి తన ఐదెకరాల పొలంలో సాగు చేసిన వరిని నూర్పు చేయగా వచ్చిన 30 బస్తాల ధాన్యాన్ని పొలంలోనే గడ్డికుప్పలో నిల్వ చేసి ఉంచారు. అర్ధరాత్రి వేళ సంభవించిన ప్రమాదంలో కాలిపోవడంతో రైతు కన్నీరుమున్నీరుగా రోదించారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. అధికారులు తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రిటైర్డు హోంగార్డుకు చెక్కు అందజేత



వేణుగోపాల్‌కు చెక్కు అందజేస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలో హోంగార్డుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన బి.వేణుగోపాల్‌కు సహోద్యోగులు అండగా నిలిచారు. తమవంతు సాయంగా ఒక రోజు వేతనాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన 4,30,260 రూపాయల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వేణుగోపాల్‌కు ఎస్పీ జి.ఆర్. రాధిక అందజేశారు.

మహాదేవునికి కుంభాభిషేకం



పేటూరు శివాలయంలో పూర్ణకుంభాలతో పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: కుంభ సంక్రమాణం సందర్భంగా సోమవారం మండలంలోని శివాలయాలు, అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. పేటూరు గ్రామంలోని మృత్యుంజయ ఆలయంలో మహాదేవునికి భక్తులు ఏకరూప దుస్తులు ధరించి కుంభాలతో జలాభిషేకం చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	54,930–00
బంగారం(22కె. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

శ్రీశైలం మల్లన్నకు పొందూరు తలపాగా

- ఏటా ఆనవాయితీగా శ్రీశైలంకు వస్త్రాలు తీసుకెళ్తున్న పొందూరు చేనేత కార్మికులు
- పొందూరుతో పాటు పలు చోట్ల నుంచి వస్త్రాల సమర్పణ
- శివరాత్రికి మల్లన్నకు నివేదన



తలపాగా, వస్త్రాలను ఊరేగిస్తున్న భక్తులు

పొందూరు: కర్నూలు జిల్లా శ్రీశైలంలో కొలువైన భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి శ్రీకాకుళం జిల్లా పొందూరు నుంచి ఏటా శివరాత్రి కానుక అందుతుంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొందూరులో తయారుచేసిన తలపాగా వస్త్రాలు శ్రీశైలం తీసుకెళ్తారు. పొందూరుతో పాటు ఈ జిల్లాలోని పలు గ్రామాల వారు తలపాగా, వస్త్రాలు తయారు చేసి శ్రీశైల మల్లన్నకు సమర్పిస్తారు. నాలుగు దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ ఏడాది ఆ అదృష్టం స్థానిక చేనేతవాడకు చెందిన బనిశెట్టి వీరాంజనేయులు, కందాన శంకరరావు, అంకం ప్రసాద్, బనిశెట్టి శ్రీనులకు దక్కింది. శివయ్యకు తలపాగా, అమ్మవారికి చీర, శనగల బసవన్న, వినాయకుడికి పంచెను నేశారు.

హైదరాబాద్, ఒంగోలుకు కూడా..

పొందూరుకు చెందిన భక్తులు శ్రీశైలంకు తలపాగా వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించడం పరిపాటి. శ్రీశైలంకు ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శివరాత్రికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, ఒంగోలుకు చెందిన వారు పొందూరు భక్తులకు పరిచయమయ్యారు. దీంతో హైదరాబాద్, ఒంగోలుకు చెందిన భక్తులు తలపాగా వస్త్రాలను పొందూరులోనే నేయించి వారి స్వగ్రామాలకు తీసుకెళ్లనున్నారు. నేరుగా అక్కడ నుంచి శివరాత్రికి శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి సమర్పిస్తారు.

సమర్పించే వస్త్రాలు ఇవే..

మల్లికార్జున స్వామికి 366 మూరల(160 మీటర్లు) పొడవు 48 సెంటీమీటర్లు వెడల్పు ఉన్న తలపాగా, భ్రమరాంబకు 6 మీటర్లు పసుపు అంచు చీర, శనగల బసవన్న(నందీశ్వరుడు)కు 6 మీటర్లు అరుణ వర్ణ అంచు పంచె, వినాయకునికి 6 మీటర్లు ఎరుపు అంచు పంచెలను నేశారు. ఈ వస్త్రాలను శివలింగాకారంలో మలిచారు. ప్రతి రోజూ తలపగా, వస్త్రాల వద్ద భజనలు చేస్తున్నారు. చేనేత వాడలోని ప్రజలంతా పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రికి ముందు రోజు ఈ వస్త్రాలను శ్రీశైలం తీసుకువెళ్లి స్వామికి సమర్పిస్తారు.

చరిత్ర సృష్టించిన ముఖలింగం

పొందూరులోని వాండ్రంగి వీధికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్లి మల్లన్నకు వస్త్రాలను సమర్పించి చరిత్ర సృష్టించారు. అలాగే లావేటి వీధికి చెందిన బూడిద చిన్నారావు 21 సార్లు స్వామికి వస్త్రాలను సమర్పించారు. వస్త్రాలను తీసుకొచ్చే పొందూరు కార్మికులకు వసతి, భోజన సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని శ్రీశైలం దేవస్థానం దేవాంగసత్రం డైరెక్టర్ కాకర్ల రాజారావు తెలిపారు. ఇప్పటికే సంబంధిత కార్మికులు వసతులు కల్పించాలని తమను కోరినట్లు వివరించారు. వారందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.



తలపాగాలను ఆలయ శిఖరంపైకి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

నిష్టతో నేస్తున్నాం



ఎంతో నియమ, నిష్టలతో శ్రీశైలం మల్లన్నకు తలపాగా వస్త్రాలను నేశాం. ఈ వస్త్రాలను నేస్తున్నంత సేపు శివ నామస్మరణలోనే ఉన్నాం. ఉపవాస దీక్షలోనే వస్త్రాలను పూర్తిచేశాం. ఏటా వస్త్రాలను నేసే మహాభాగ్యం మాకు దక్కుతుండటం ఎంతో సంతోషంగా ఉంటుంది.

– అంకం ప్రసాద్, చేనేత కార్మికుడు, పొందూరు

తలపాగా వస్త్రాలను నేయించాను



పొందూరుకు చెందిన భక్తులు శ్రీశైలంలో పరిచయమయ్యారు. తలపాగా వస్త్రాలను తీసుకువచ్చి మల్లికార్జున స్వామికి సమర్పించడం కనుల విందుగా ఉంటుంది. దీంతో వస్త్రాల విశిష్టతను తెలుసుకున్నాను. ఈ ఏడాది వస్త్రాలను పొందూరులో నేయించాను. వస్త్రాలను హైదరాబాద్ తీసుకువెళ్తున్నాను. ఎంతో సంతోషంగా ఉంది. అక్కడ నుంచి శ్రీశైలంకు శివరాత్రికి వెళ్లి వస్త్రాలను సమర్పిస్తాను.

– ఉప్పు బీమసుందరరావు, హైదరాబాద్.

లావేరులో శ్రీశైలం మల్లన్న తలపాగా ఊరేగింపు

లావేరు: మండలంలోని లావేరు గ్రామంలో సోమవారం శ్రీశైలం మల్లికార్జున స్వామి కోసం చేనేత మగ్గంపై నేసిన తలపాగాను ఊరేగించారు. లావేరు గ్రామంలోని పెద్దవీధికి చెందిన చేనేత కార్మికులు కాశిన వెంకటరమణ, కాశిన సవరాజు కుటుంబ సభ్యులు శివరాత్రి రోజున శ్రీశైలం మల్లన్నకు సమర్పించడం కోసం తలపాగాను చేనేత మగ్గంపై నేశారు. సోమవారం గ్రామంలోని ఆలయాల్లో తలపాగాకు పూజలు నిర్వహించి ఆనంతరం ఊరిలో మేళతాళాలతో ఊరేగించారు.



లావేరులో మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కృషి చేసేలా తమకు విద్యా సంస్కరణల్లో భాగంగా శిక్షణ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. స్టేట్ కౌన్సిల్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎస్‌ఈఆర్టీ-అమరావతి) ఆధ్వర్యంలో ఈ నెల ఆరు నుంచి పదో తేదీ వరకు ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-అహ్మదాబాద్ (ఐఐఎంఏ) రీసెర్చ్ సెంటర్‌లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న జిల్లా ఉపాధ్యాయులు తిరిగి చేరుకున్నారు. ఇందులో భాగంగా శిక్షణకు హాజరైన ఇచ్ఛాపురం మండలం ధర్మపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శున్నాముద్ది విశ్వనాథం సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణల్లో భాగంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యత పెంపొందించేందుకే తమకు శిక్షణ ఇచ్చారని వివరించారు. జిల్లా నుంచి తనతో పాటు బి.చిన్నాజీవర్మ (ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్-సోంపేట), మల్లారెడ్డి దేవరాణి (హెచ్ఎం-కొర్లకోట), నూక రామకృష్ణ (ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్-కొల్లివలస), ఎ.సంజీవరావు (హెచ్ఎం, లోలుగు)లు శిక్షణకు హాజరయ్యారన్నారు. క్రమశిక్షణ, మధ్యాహ్న భోజనం నిర్వాహణ, తరగతి గది నిర్వహణ, ఆరోగ్యం వంటి కమిటీల్లో విద్యార్థులను భాగస్వామ్యులుగా చేయాలని శిక్షణ ఇచ్చిన వారు సూచించారని వివరించారు.



శిక్షణ పూర్తి చేసుకున్న సిక్కోలు ఉపాధ్యాయులు

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఈమె కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. రెండు రోజుల్లో ఈమెకు వివాహం జరగాల్సి ఉందన్నారు.

సామాన్యుడి వార్తా సాధనం రేడియో

శ్రీకాకుళం: ఒకప్పుడు వార్తల సమాచారం తెలుసుకోవాలంటే రేడియో ముఖ్య సాధనంగా ఉండేదని ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి ఇలా నిర్ణీత సమయాల్లో వచ్చే ఆకాశవాణి వార్తలకు అత్యంత అదరణ ఉండేదని చెప్పారు. ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్, ఇంటాక్ ఆధ్వర్యంలో రేడియో దినోత్సవాన్ని నిర్వహించారు. వార్తలు, సమాచారం, వినోదం, విజ్ఞానం, వ్యవసాయం, సంగీతం.. ఇలా అన్ని విషయాల్లోను అందరినీ ఆకట్టుకునే సాధనంలో రేడియో ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. 1920 దశకంలో అందుబాటులోకి వచ్చిన రేడియో ప్రసారాలను బ్రిటీష్ పాలకులు వారి ఆధీనంలో ఉంచుకుని కొన్ని ప్రచారాలను మాత్రమే అందించేవారని గుర్తు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా వార్తలను అందించడంలో ఆకాశవాణి ముందుడేదని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆకాశవాణి ప్రతినిధి ఎస్.జోగినాయుడు, రాష్ట్ర ఇంజినీర్ల సంఘం ఉపాధ్యక్షుడు కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ జి.ఇందిరాప్రసాద్, శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.పోలీస్, రోటరీ ప్రతినిధులు ఎం.జగన్మోహన్ రావు, బి.ప్రసాద్, పి.పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన బీఆర్ఏయూ వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని సోమవారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీని సందర్శించాలని ఎంపీని కోరినట్టు వీసీ చెప్పారు. వర్సిటీ ప్రగతి, ప్రధాన సమస్యలు వివరించి సహకారం కోరినట్లు తెలిపారు.



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరావు

పీఏసీఎస్ సిబ్బంది చేతివాటం!

● తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు

సారవకోట: సారవకోట ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది చేతివాటం రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలో లక్ష్యానికి మించి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. అప్పటికీ కొన్ని ఆర్‌బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు పూర్తి కాకపోవడంతో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచన మేరకు ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలుకు మరింత లక్ష్యం కేటాయించారు. దీంట్లో భాగంగా కుమ్మరిగుంట రైతు భరోసా కేంద్రానికి మరో 500 బస్తాలు కొనుగోలు కేటాయిస్తు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీంతో సారవకోట పీఏసీఎస్ ద్వారా ఆర్‌బీకేల్లో నియమించిన డీఈఓలు తమ చేతివాటం ప్రదర్శించి వారి లాగిన్‌లో వారికి అనుకూలమైన రైస్‌మిల్లులకు సంబంధిత షెడ్యూల్‌లో ఇచ్చిన రైతుల పేర్లు కాకుండా వేరే పేర్లతో ట్రక్కు షీట్లు జనరేట్ చేశారు. దీన్ని గుర్తించిన రైతులు తహసీల్దార్ ప్రవల్లికా ప్రియకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె వెంటనే సారవకోట పీఏసీఎస్ సీఈఓ సుందరరావును పిలిచి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడంతోపాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తామంతా రైతులకు మేలు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేసేలా ప్రయత్నం చేస్తుంటే.. పీఏసీఎస్ సిబ్బంది తీరుతో తమ ప్రయత్నం వృథా అవుతుందని తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

హైవేపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసులు, హైవే అధికారులు

● నేటి ఉదయం 7 గంటల వరకు గడువు

రణస్థలం: జె.ఆర్.పురం (రణస్థలం) జాతీయ రహదారి మధ్యలో, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని స్థానిక సీఐ ఎస్.ఆదాం, మండల తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌లు సోమవారం తెలిపారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా హైవే స్థలంలోని ఆక్రమణలు తొలగించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. హైవే సైట్ ఇంజినీరు కరీమ్‌తో సహా జె.ఆర్.పురం పోలీసు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల ఎస్సైలు, రెవెన్యూ అధికారులు వచ్చి ఆక్రమణలు ఖాళీ చేయాలని సంబంధిత వ్యక్తులను ఆదేశించారు. దీతో ఒక రోజు గడువు కావాలని వారు వేడుకున్నారు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలంటే వస్తువులు, కూరగాయలు, పండ్లు ఇతరత్రా సామగ్రి నష్టపోతామని ప్రాదేయపడ్డారు. దీంతో మంగళవారం ఉదయం ఏడు గంటల్లోగా పూర్తిస్థాయిలో హైవే స్థలం ఎంతవరకు ఉందో అంతవరకు ఖాళీ చేయాలని ఆదేశించారు. తరువాత హైవే అధికారులు అన్ని దుకాణాలకు వెళ్లి గతంలో ఇచ్చిన నోటీసుల ప్రాప్తికి మరో మారు ఆక్రణమలు ఖాళీ చేయాలని సూచించారు. రణస్థలం మండల కేంద్రంలో వేయాల్సిన ఫ్లెక్టైవర్ ఇంకా ప్రతిపాదన దశలోనే ఉందని, మరో ఆరు మాసాలు పడుతోందని హైవే అధికారులు చెప్పారు. ఇలోగా ట్రాఫిక్ అంతరాయంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రెడ్ స్పాట్‌లో ఉన్న రణస్థలంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం ఎస్సైలు జి.రాజేష్, ఎస్.సత్యనారాయణ, ఎ.కోటేశ్వరరావు, సీహెచ్ రామారావు, మండల సర్వేయర్ ఎస్.రవికుమార్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లు, హైవే అధికారులు ఉన్నారు.

నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో నలుగురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన కోట్ల రేవతి కనకమహాలక్ష్మి, సంగం కరుణ, గుడివాడ కనకమహలక్ష్మి, అనుపూజ నీలిమలు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతరపల్లి పీహెచ్‌సీలో ఎస్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ నలుగురు మహిళలు విధులకు ఆటోలో వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి టాటా ఏస్ వాహనంలో విధులకు బయలుదేరారు. భోగాపురం చేరుకునేసరికి వాహనం అదుపుతప్పి వైడర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కేజీబీవీల్లో మెరుగైన విద్య

- అన్నింటా సత్తాచాటుతున్న విద్యార్థినులు
- నిత్యం శ్రమిస్తున్న బోధకులు

బూర్జ:

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అన్ని విభాగాల పరిధిలోని పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తోంది. దీంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇక్కడ మెరుగైన విద్య అందుతుండడంతో చదువు కోవడానికి బాలికలు పోటీ పడుతున్నారు. జిల్లాలో 25 కేజీబీవీలు ఉన్నాయి. ఆమదాలవలస, బూర్జ మండలం కొల్లివలస, ఎచ్చెర్ల, జి.సిగడాం, గార, హిరమండలం, ఇచ్ఛాపురం, జలుమూరు, కంచిలి, కవిటి, కోటబొమ్మాళి, కొత్తూరు, ఎల్.ఎన్.పేట. లావేరు, మందస, మెళియాపుట్టి, నందిగాం, పాతపట్టణం, పోలాకి, పొందూరు, రణస్థలం, సంతబొమ్మాళి, సారవకోట, సోంపేట, శ్రీకాకుళంలో కేజీబీవీలు ఉండగా.. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 6,386 మంది చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో బాలికలకు చదువుతో పాటు కుట్లు, అల్లికలు నేర్పుతున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థినులకు ప్రభుత్వం ఇటీవల ట్యాబ్‌లను కూడా అందజేసింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌సీ సిలబస్‌లో పాఠ్యాంశాలు బోధించనున్నారు. విద్యార్థినులకు వివిధ ఆటల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపిస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థినులు

వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ



కేజీబీవీల్లో చదువులో వెనుకబడే విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చేలా చర్యలు చేపట్టాం. వీరి కోసం అదనపు తరగతులు నిర్వహిస్తాం. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నాం.

–డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఏపీడీ, సమగ్రశిక్షా, శ్రీకాకుళం

క్రమశిక్షణతో కూడిన విద్య



విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నాం. పిల్లల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలి. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం.

– బెండి అన్నపూర్ణ, తెలుగు ఉపాధ్యాయరాలు, కొల్లివలస కేజీబీవీ

అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు



అందరి సహకారంతో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. కొలివలస కేజీబీవీలో ఉత్తమ బోధన చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నాం.

–కె.గాయత్రి , ప్రిన్సిపాల్, కొల్లివలస కేజీబీవీ

చక్కగా బోధిస్తున్నారు..

కొల్లివలస పాఠశాలలో ఆరో తరగతి నుంచి చదువుతున్నాను. సిబ్బంది చక్కగా బోధిస్తున్నారు. అన్ని తరగతుల్లో మంచి మార్కులు సాధించాను.

– కొయ్యాన రాజేశ్వరి, ఇంటర్ ప్రథమ సంవత్సరం, కొల్లివలస కేజీబీవీ